
# అమ్మాయ్...నందు

బెలగాం గాయత్రి



వాతావరణం ప్రశాంతంగా వుంది. ఆకు పచ్చని తివాచీ పరిచినట్లుగా వున్న పొలాల మధ్య మా కాలేజీ వుంది. నేను రెండవ అంతస్తులో వున్న లైబ్రరీ రూంలో 'ఎ బుక్ ఆన్ సి' రిఫర్ చేస్తున్నాను. చల్లని గాలిలో మనస్సు మరింత ప్రశాంతంగా వుంది. ఆ ఆహ్లాదకరమైన వాతావ రణం నుండి ఎవరో తరుముతున్నట్లుగా నిశ్శబ్దం పారిపోయింది. వెంటనే బయటకు తొంగి చూశాను.

కొందరు స్టూడెంట్స్ తాపీగా తప్పదన్నట్లు నడుస్తుండగా, మరికొందరు మాత్రం వాళ్ల క్లాస్ రూమ్స్ వైపు పరుగుతీస్తున్నారు. ఏం జరుగుతుందో నాకు అర్థం కాలేదు. వెంటనే పుస్తకాలు షెల్ఫ్‌లో పెట్టి బ్యాగ్ పట్టుకొని బయటకు వచ్చాను.

''ఏమయింది'' అంటూ ఎవరిని అడిగినా ''ముందు ఇక్కడినుండి పారిపో'' అనే సమాధానం తప్ప నాకు కావలసిన సమాధానం దొరకలేదు.

''లహరీ!.. లహరీ!.... ఇక్కడేం చేస్తున్నావు? క్లాసుకు పద! అంటూ పరుగెత్తుతూ వచ్చిన ఫాతిమా పరుగు ఆపకుండానే నా చేయి పట్టుకొని క్లాస్‌రూం వైపు దారితీసింది.

వెంటనే ఆమె చేతిని విదిలించుకుంటూ ''ఏం జరిగింది?ఎందుకు పరిగెడుతున్నారు? ఎవరూ సమాధానం చెప్పరేం?'' అన్నాను కోపాన్ని ప్రదర్శిస్తూ.

''నందూ ఈరోజు కాలేజీకి వచ్చింది! అసలే వారం రోజుల నుండి రావటం లేదు. ఇప్పుడు ఆమెకి ఎదురైతే ఏమవుతుందో నీకు అర్థం కాదు గానీ... ముందు నడు!'' అంటూ వేగంగా నడుస్తూంది.

నేను ఆమెని అనుసరించక తప్పలేదు.

క్లాసులో అడుగుపెట్టగానే పులి నుండి తప్పించుకొని పరుగు ఆపిన లేడిలా ఊపిరి తీసుకుంది ఫాతిమా.

''ఎవరా నందూ?! ఆమెని చూసి ఎందుకు అలా పరుగెడుతున్నారు?'' అని బెంచీపై కూర్చుంటూ ఫాతిమాని అడిగాను.

''ఆమె పేరు నందిని. ఈ కాలేజ్‌లో ఆమె అంటే అందరికీ హడల్!''అంది నా పక్కనే కూర్చుంటూ.

''ఎందుకని? ఆమెది రౌడీ రంగమ్మ కేరక్టరా?'' ఆశ్చర్యంగా అడిగాను.

''ఆమె అటువంటిది కాదు. ఎవరైనా మనిషి కనబడితే చాలు, వాళ్లని పట్టుకొని తన గొప్పలు చెప్పుకుంటుంది. అందులో ఏవీ నిజాలు కావు. అన్నీ అబద్ధాలే. అవి వినలేక అందరూ పరుగెత్తుతున్నారు.''

> ''నందూ ఈ రోజు కాలేజీకి వచ్చింది! అసలే వారం రోజుల నుండి రావటం లేదు. ఇప్పుడు ఆమెకి ఎదురెతే ఏమవుతుందో నీకు అర్థం కాదుగానీ... ముందు నడు!'' అంటూ వేగంగా నడుస్తూంది.

''మరి కొంతమంది అంత విచారంగా, నెమ్మదిగా ఎందుకు నడుస్తున్నారు?''

''ఆమె వెళ్లేది వాళ్ల క్లాసురూంకే. ఎలాగూ వాళ్లకి తప్పదుగా. అందుకే విచారం''

''అయినా ఆమె చెప్పేవి నిజాలే కావచ్చుకదా'' అన్నాను.

''ఏమిటి నిజం?! ఉదాహరణకి ఒకటి చెబుతాను విను'' అంది మా సంభాషణాన్ని వింటున్న కళ్యాణి.

రిలీజ్ కాని సినిమా స్టోరీ వింటున్నట్టుగా ఆమె చెబుతున్నది వింటున్నాను.

ఆమె కూడా అదే ఫీలింగ్‌తో ప్రారంభించింది.


''ఒకసారి ఆమె ఒకర్తే ఇంట్లో వుందట! కాలింగ్ బెల్ వినబడి తలుపు తీసిందట! ఎదురుగా ఏనుగులాంటి మనిషి వున్నాడట! లోపలికి వచ్చి ఆమె ఒంటిమీద నగలన్నీ ఇవ్వమని కత్తితో బెదిరించాడట. అప్పుడు ఆమె ఒంటిమీద నూటాఏభై తులాల బంగారం వుందట. ఆమె ఫైటింగ్ చేసి వాడ్ని చితకబాదిందట'' అంటూ ముగించింది.

ఆమె చెప్పింది విన్న నాకు ఏమీ ఆశ్చర్యం కలగలేదు.''అది నిజమై వుండచ్చు కదా'' అన్నాను.

''అయ్యో! లహరీ! ఆమెకి అప్పుడు పదేళ్లయినా లేవట. ఏనుగు లాంటి మనిషికి బుర్రమీసాలు భయంకరంగా వున్నాయట. అవి కట్ చేసి అతని చేతిలోనే పెట్టిందట. ఇటువంటి పది సంఘటనలు ఒక్క నిమిషంలో విడవకుండా చెబుతుంది. అదే ఆమె స్పెషాలిటీ'' అభినయిస్తూ చెప్పింది కళ్యాణి.

అప్పటికే అందరూ నా చుట్టూ చేరారు. వెంటనే నేను ఆశ్చర్యపడినట్టు బయటికి కనిపించకుండా, ''






నిజమే, ఆమె గొప్పలు అబద్ధాలు చెప్పుకుంటుంది. అది ఆమె నైజం. అందుకని ఆమెకి దొరక్కుండా అందరూ పరుగెడుతున్నారు కదా. ఆమె ఏమనుకుంటుంది? ఆమె చెప్పింది విని 'ఊ' కొడితే మనకేమయినా పోతుందా'' అంటూ వాళ్లని మందలించే ధోరణిలో చెప్పాను.

''కొత్తలో అందరూ అలాగే అంటారు. అనుభవిస్తే కానీ ఎవ్వరికీ అర్థం కాదు'' అంటూ ఎవరి ప్లేస్‌కి వాళ్లు వెళ్లిపోయారు.

మేథ్స్ లెక్చరర్ రావడంతో మా సంభాషణకి తెరపడింది.

నేను వారం రోజుల క్రితం ''రాజేశ్వరీ ఉమన్స్ కాలేజ్‌లో డిగ్రీ ఫైనలియర్‌లో చేరా. మా నాన్నగారి ట్రాన్స్‌ఫర్ వలన ఈ ఊరికి వచ్చేశాం. ఫాతిమా వాళ్ల పక్క ఇంటిలో మేముంటున్నాం. ఫాతిమా నాకు అన్ని విధాలా సహాయం చేస్తూ వుంటుంది. కానీ నందినీ విషయంలో ఆమె ప్రవర్తన, ఆమెదే కాదు, కాలేజీలో ఎవరి ప్రవర్తనా నాకు నచ్చలేదు.

ఒక్కొక్కరి స్వభావం ఒక్కొక్క విధంగా వుంటుంది. గొప్పలు చెప్పి ఆనందించే స్వభావం నందినీది. ఆమెని ఎగతాళి చేయకూడదు. కావాలంటే ఆమె ప్రవర్తనను మార్చే ప్రయత్నం చేయాలి అనుకున్నాను.

ఆ రోజు ఫాతిమా కాలేజీకి రాలేదు. క్లాసు అవగానే బయటికి వచ్చాను. ఓ అమ్మాయి నాకు ఎదురుగా వస్తోంది. ఆమె పసిడిరంగు ఛాయలో వుంది. ఆమె వేసుకున్న నిమ్మపండు రంగు చుడీదార్ మేని రంగులో కలిసిపోయింది. హై హీల్స్ వేసుకున్న దేవతాకన్యలా నడుస్తూంది. ముఖంపై పడిన ముంగురులను పక్కకు తొలగిస్తూ, నా దగ్గరగా వచ్చి ఆగింది.

''హాయ్....లహరీ!...'' చిరునవ్వుతో పలుకరించింది.

''మీరు..''

''నా పేరు నందిని''

వెంటనే నా గుండెల్లో రాయి పడింది.

అయినా ఆమె పట్ల అందరిలా ప్రవర్తించకూడదని పెదవులపై చిరునవ్వుని చిందిస్తూ, ''పదండి, అలా నడుస్తూ మాట్లాడుకుందాం'' అన్నాను కళ్లతోనే దారిని చూపిస్తూ.

''మీరు కొత్తగా కాలేజీలో చేరారని తెలిసింది. నేను ఈ మధ్య కేంప్‌లో వున్నాను. ఇంతకీ మీరు ఎక్కడినుంచి వచ్చారు?'' అంది. ఆమె నాతో పాటు నడుస్తూ.

''హైద్రాబాద్'' అని నేను పూర్తి చేయకముందే ''హైద్రాబాదా! అక్కడ మా మేనత్త వున్నారు. వాళ్ల ఇల్లు 30 ఎకరాల స్థలంలో కట్టించారు. వారి తోటలో ఒక పెద్ద బావి వుంది. దాని చుట్టూ గట్టు బంగారంతో కట్టించారు. ఒకరోజు బావిలో తొంగి చూశాను.బాప్‌రే! ఎన్ని వజ్రాలు, రత్నాలు వున్నాయనుకున్నావ్!'' అంటూ ఆమె ఊపిరి తీయకుండా మాట్లాడుతోంది.

''అది హైద్రాబాద్‌లో ఏ ప్లేస్ లో వుంది'' అన్నాను ఆమె మాటలకు అడ్డుపడుతూ.

''అడ్రస్ కరెక్ట్‌గా తెలీదు. డాడీని కనుక్కొని చెబుతాను'' అంటూ ఆమె మాటలను కొనసాగిస్తూనే వుంది. కానీ అవి నా మెదడును శూలాల్లా గుచ్చుతున్నాయి.

టాపిక్‌ను మార్చాలని, ''ఈ మధ్య సినిమాలేవయినా చూశారా?'' అన్నాను.

''నేను మెగాస్టార్ సినిమాలు తప్ప మరేవీ చూడను. ''చిరు'' మాకు దగ్గర బంధువు. నేను పుట్టగానే నందిని నా కోడలు అని అతను అప్పుడే చెప్పేశారు. కానీ నేనే ఒప్పుకోలేదు'' అంటూ దానికి సంబంధం లేని మరో విషయాన్ని కంటిన్యూ చేసింది.

ఆమె చెబుతున్నది నేను వింటున్నానో లేదో అని కూడా చూడడం లేదు. ఆమె తన ధోరణిలో చెప్పుకుంటూ నడుస్తుంది. అయినా ఓపికగా ఆమె చెప్పినవన్నీ వింటున్నాను.

నా మెదడులో సన్నగా నొప్పి ప్రారంభమైంది. నెమ్మదిగా ఆ నొప్పి తలంతా వ్యాపించింది.

నా చెవులకు ఆమె మాటలేవీ వినిపించటం లేదు. కాలేజీలో అందరూ ఈమె నుండి ఎందుకు తప్పించుకుంటున్నారో నాకు అర్థమయింది. నేను ఇప్పుడు రెండు గంటలుగా భరించలేకపోతున్న బాధని వాళ్లు రెండు సంవత్సరాలుగా భరిస్తున్నారు.

నందిని సాయంత్రం టిఫిన్ చేయవలసిన అవసరం లేకుండా నా మెదడును తినేసింది.

ఎలాగో తప్పించుకొని ఆమె నుండి బయటపడ్డాను.

ఇంటికి రాగానే మమ్మీ నన్ను చూసి '' ఏమి అలా వున్నావు?'' అని అడిగింది ఆత్రుతగా.

తలనొప్పిగా వుందమ్మా! అంటూ నా రూంకి వెళ్లి నిద్రలో జారుకున్నాను.

''లహరీ... లే, లేచి భోజనం చేయి'' అని అమ్మ గొంతు వినపడింది. లేచి టైం చూశాను.

రాత్రి 9 గంటలయింది. వెంటనే భోజనం చేసి హాల్‌లో కూర్చున్నాను.

''లహరీ.. లహరీ..'' అంటూ ఫాతిమా వచ్చింది.

''రా... కూర్చో ఫాతిమా'' అంటూ ఆహ్వానించాను.

''ఈ రోజు నందిని నిన్ను కలిసింది కదూ''

''నీకెలా తెలుసు''

''సాయంత్రం నీకోసం ఇంటికి వచ్చాను. కాలేజీ నుండి వచ్చి తలనొప్పి అని పడుకున్నావని ఆంటీ చెప్పారు. అందుకే నందిని నిన్ను కలిసుంటుందని ఊహించాను'' నవ్వుకుంటూ జవాబిచ్చింది.

''నిజమే ఫాతిమా! నరకం ఎలా వుంటుందో తెలిసింది!'' అన్నాను.

ఆ రాత్రి ఫాతిమా దగ్గర సెలవు తీసుకొని మళ్లా నిద్రలోకి జారుకున్నాను.

రోజుకి ఒక్కసారైనా నందిని నన్ను కలసి నా మెదడు కొంచెం భోంచేసి వెళ్తుంది.

కాలేజ్‌లో మిగిలిన వాళ్లు తప్పించుకున్నట్లే నేనూ ఆమెకు కనబడకుండా తిరుగుతున్నాను.

ఎదుటి వారు తనని ఎగతాళి చేసినా ''నన్ను కాదు'' అనే ధోరణిలో వుండేది.

నేను అనుకున్నట్లే నా అడ్రస్ వెతుక్కుంటూ ఇంటికి వచ్చి మరీ తన గొప్పలు చెబుతుంది.

నందిని గొప్పలు చెప్పకుండా ఆమెలో మార్పు తీసుకురావాలి. ఇది నా వల్ల సాధ్యమేనా అని ఆలోచించాను. సాధ్యం కానిది ఈ లోకంలో ఏదీ లేదు అని నన్ను నేను ప్రోత్సహించుకున్నాను.

రాత్రి మంచంపై పడుకున్నా నాకు అదే ఆలోచన. ఒక్కసారి పరిష్కారం దొరికింది అన్నట్లుగా లేచాను. వెంటనే పేపరు, పెన్ను తీసుకున్నాను. ఒక కథ రాయటం ప్రారంభించాను. ఆ కథలో నందిని స్వభావం వున్న ఒక పాత్రను తీసుకున్నాను.

ఆమె చెప్పే గొప్పలు,అవి విన్న ఇతరుల బాధలు కళ్లకు కట్టినట్లుగా ఇరవై పేజీల వరకూ రాశాను. స్నేహితుల మాటవిని ఆమె తన స్వభావం మార్చు

కున్నట్లుగా ముగింపు చేశాను.

ఒక మంచి పని చేస్తున్నాను అనే ఆనందంతో హాయిగా నిద్రాదేవత ఒడిలో ఒదిగిపోయాను.

మరునాడు కాలేజీలో అందరూ లంచ్ పూర్తి చేసుకొని కబుర్లు చెప్పుకుంటున్నారు.

''డియర్ ఫ్రెండ్స్, నందిని మనకు చేసే చిత్ర హింసలకు ఈరోజుతో తెర దిగుతుంది. నేను ఆమె స్వభావం మార్చే ఒక ప్లాన్ వేశాను. ఆమె ఇక్కడికి వచ్చే టైం అయింది. ఎవ్వరూ పారిపోకండి'' అన్నాను.

అందరూ 'సరే' అన్నట్లుగా తల ఊపారు.

ఎదురు చూపులు లేకుండానే నందిని ప్రత్యక్ష మయింది. ఆమెను చిరునవ్వుతో ఆహ్వానిస్తూ, ''నందినీ! నేను ఒక కథ రాశాను. అది చదివి వినిపిస్తాను. అదిచదివి దానిపై నీ అభిప్రాయం చెప్పు'' అన్నాను.

''అలాగే'' అంటూ ఓ ఎత్తైన బల్లపై కూర్చుంది.

అందరూ నా చుట్టూ చేరారు. నేను కథ చదవటం ప్రారంభించాను. అక్కడ వున్నవాళ్లంతా నేను ఎవరిని వుద్దేశించి కథ రాశానో అర్థమైనట్లు చిన్నగా నవ్వుతున్నారు.

అందరూ నందినివైపు చూశారు. ఆమె మాత్రం చదువుతున్న నా వైపే ఏకాగ్రతతో చూస్తుంది.

ఆమె ముఖంలో రంగులు ఎలా మారుతున్నాయో చూద్దామని ఓరకంటితో ఆమె వైపు చూశాను. ముఖం కందగడ్డలా వుంది. చాలా సీరియస్‌గా వింటూంది.

ఆమె ముఖం చూస్తుంటే తన స్వభావం మార్చుకుంటుందో లేదో నాకు ఏమీ అర్థం కాదు. అయినా విజయం నావైపే వుంటుందని చదువుతూ, మిగిలిన వారివైపు విజయగర్వంతో చిరునవ్వుని విసిరాను.

కథ చదవటం పూర్తి అయింది. అందరూ నందిని వైపు చూస్తున్నారు. కథ చదవటం పూర్తి కాగానే అప్రయత్నంగా నా కళ్లు కూడా ఆమెని చూశాయి.

నందిని ఒక్క ఉదుటున బల్లపై నుండి దూకింది. ఏమీ మాట్లాడకుండా నా వైపే వస్తూంది. నా గుండెల్లో చిన్న వణుకు ప్రారంభమయింది. ఒక అడుగు వెనక్కి వేశాను. ఆమె నోటి ద్వారా ఏ మాట వస్తుందో అని అందరూ చూస్తున్నారు. ఆమె వాలకం చూస్తే ఇంతమందిలో నన్ను అవమానిస్తావా అంటూ వచ్చి చాచి లెంపకాయ కొడుతుందేమో అన్నట్లుగా వుంది. ఆ నిమిషంలో నాకు చాలా భయం వేసింది. ఫాతిమా చేతిని గట్టిగా పట్టుకున్నాను. నందని నా ముందుకు వచ్చింది. నా చేతిలో పేపర్స్‌ని లాక్కొంది. పేపర్స్ అన్నింటిని తిప్పి తిప్పి చూసింది.

నందిని ఒక్క ఉదుటున బల్లపై నుండి దూకింది. ఏమీ మాట్లాడకుండా నా వైపే వస్తూంది. నా గుండెల్లో చిన్న వణుకు ప్రారంభమయింది. ఒక అడుగు వెనక్కి వేశాను. ఆమె నోటి ద్వారా ఏ మాట వస్తుందో అని అందరూ చూస్తున్నారు. ఆమె వాలకం చూస్తే ఇంతమంది లో నన్ను అవమానిస్తావా అంటూ వచ్చి చాచి లెంప కాయ కొడుతుందేమో అన్నట్లుగా వుంది.

నా భుజాన్ని గట్టిగా ఊపుతూ ''వెరీగుడ్ లహరీ! చాలా బాగా రాశారు. నా మనస్సులో వున్నది రాశావు. మొన్నామధ్య లండన్ నుండి మా బాబాయి వచ్చి నన్ను లండన్‌లో చదివిస్తాను అంటే నేను రాను ఇండియాలోనే చదువుతాను అన్నాను కదా. అతని అమ్మాయిది నీ కథలో పాత్ర స్వభావం. నాలుగు తగిలించి ఆమెని దారిలో పెట్టాను'' అంటూ ఊపిరి తీయకుండా తన ధోరణిలో మాట్లాడుతూనే వుంది.

చుట్టూ చూశాను. అంతవరకూ నా చుట్టూ వున్న వాళ్లు ఎవరూ లేరు. వాళ్లు ఎప్పుడు పారిపోయారో కూడా నాకు తెలియదు.

నందిని మాత్రం ఆమె లండన్ బాబాయి. అతని కూతురి గురించి మాట్లాడుతూనే మరో టాపిక్‌లో జంప్ అయింది.

ఊపిరి తీయకుండా మాట్లాడుతున్న ఆమె మాటలు విని నా ఊపిరి ఎక్కడ ఆగుతుందో అని చుట్టూ చూస్తున్నాను తన బారి నుండి తప్పించుకోవటానికి.

★


## మీ పెట్టుడు పళ్ళు నేచురల్‌గా లేవా ? కాంప్రమైజ్ కావద్దు!!

**ఆధునిక దంత వైద్యం**




ప్రొ॥ డా॥ పి.వి.పార్థసారథి డా॥ కె.ఎం.సుమలత
కాస్మటిక్ డెంటల్ స్పెషలిస్ట్స్

ప్రతి పది మందిలో నలుగురు కృత్రిమ దంతాలపై ఆధారపడి ఉన్నారని ఓ అంచనా ! ఎంతో ఖర్చు చేసి అమర్చిన కృత్రిమ దంతాలు చాలావలకు నిరాశనే మిగిలిస్తున్నాయని 50 శాతం మంది ఫిర్యాదు !

**ఇమిడియట్ డెంచర్లు ఎంతో సౌకర్యం**

పళ్ళు వదులైనప్పుడో లేదా అవి తీసిపెట్టాల్సి వచ్చినప్పుడో మునుపైతే కొన్ని వారాల వరకు ఆగాలనేవారు. కాని ఇప్పుడలా కాదు. ఆధునిక దంత వైద్యంలో పళ్ళు పీకిన కొన్ని గంటలలోపే కృత్రిమ దంతాలను అమర్చగలుగుతున్నాము. వీటినే ఇమిడియట్ డెంచర్లంటారు. వీటి వల్ల చికిత్స తరువాత బయట తమ పనులు చేసుకోవడానికి ఎటువంటి ఇబ్బంది ఉండదు.

**ట్రయల్ డెంచర్లు తప్పనిసరి !**

చాలాసార్లు పళ్ళు బిగించుకున్న తర్వాత అవి పేషెంటుకు నచ్చవు. పొట్టిగా ఉన్నాయనో లేదా పొడవుగా ఉన్నాయనో, రంగు సరిగా లేదనో సైజు సరిపోలేదనో మనం వంకలు పెడుతుంటాం. దంత వైద్యుడ్ని నిందిస్తాం. ఇటువంటి సంకట స్థితి నుండి బయట పడాలంటే ఉన్న ఒకే మార్గం ట్రయల్ డెంచర్లు.

**మనకు తగ్గట్టుగా పళ్ళుండాలి !!**

మనం కొంత మందికి తయారు చెయ్యబడ్డ పళ్ళను చూస్తే 'పెట్టుడు పళ్ళు'గా చెప్పేయచ్చు. ఎందుకంటే అవి వారి వయసుకు తగ్గట్లు ఉండవు. కృత్రిమ దంతాలను ఓ పద్ధతి ప్రకారం తయారు చేయాలి.

పెట్టుడు పళ్ళలో కూడా ఆడ, మగలుంటాయి. ఆడవారికి బిగించే పళ్ళైతే సున్నితంగాను, మెరిసే రంగుతోను, పెదవుల ఆకారానికి తగ్గట్టుండాలి. అదే మగ వారికైతే కొంచెం పెద్ద సైజులో దృఢంగా కన్పిస్తూ పంటి కొసలు రాటుతేలినట్లు, కొంత అరిగినట్లుండాలి. ఇలా ఒక్కొక్కరికి ఒక్కో విధంగా ముఖానికి నప్పేట్లు చెయ్యగలిగినప్పుడే అమర్చే కృత్రిమ దంతాలు నాచురల్‌గా కన్పిస్తాయి.


ట్రీట్‌మెంట్‌కు ముందు


ట్రీట్‌మెంట్‌కు తరువాత

**ఇబ్బంది కొన్ని రోజులే !**

మనకు మొదట్నుంచి నోట్లో ఉన్న సహజసిద్ధ దంతాలను తీసేసి ఒక్క రోజులో వేరే పళ్ళు అమర్చగానే అందరూ కాకపోయినా కొంతమంది అసౌకర్యంగా ఫీలవుతారు. ఇది కేవలం ఒకటి రెండు రోజులే. తరువాత ఎంతో సౌకర్యంగా ఉంటాయి. చాలాసార్లు నాచురల్ పళ్ళకంటే కృత్రిమ దంతాలే ఎంతో అందంగా, ఆకర్షణీయంగా, దృఢంగా కూడా ఉంటాయి !!!

మొదటి అంతస్తు, స్కిల్ స్పెక్ట్రమ్ కాంప్లెక్స్
టిటిడి కళ్యాణ మండపం ప్రక్కన, లిబర్టీ సెంటర్
హిమాయత్‌నగర్, హైదరాబాద్
ఫోన్:55991010, సెల్:9346442644

**పార్థ దంత వైద్యశాల & రీసర్చి సెంటర్**
ఆర్టీసి బస్టాండ్ దగ్గర, పెద్దకాపు లే ఔట్, తిరుపతి.
ఫోన్:0877-2250555, 2250105